www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 31 డిసెంబర్ 2023

5

అన్నమయ్య



చదువుతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యత : 'ఆకేపాటి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తమ విద్యా సంస్థలో చదువుతోపాటు విద్యార్థుల ఆరోగ్యం పట్ల కూడా ప్రాధాన్యతనిస్తామని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి తెలియజేశారు. శనివారం పాఠశాలలో విద్యార్థులకు యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఏజిఎం రమణయ్య ఆధ్వర్యంలో తమ పాఠశాలలో విద్యతో పాటు ఆరోగ్యం, మానసిక వికాసం వంటి అంశాల పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని పేర్కొన్నారు. తమ పాఠశాలలో యోగా, కరాటే, డ్యాన్స్ వంటి వ్యాయామానికి ప్రాధాన్యతనిచ్చే అంశాలలో కూడా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యం ఎంతో ఉల్లాసంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం యోగా పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు టి.రెడ్డయ్య, వైస్ ప్రిన్సిపల్ అనూష, ప్రైమరీ ఇన్‌చార్జ్ కస్తూరిబాయి, డీన్ వెంకటసుబ్బయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు చంద్ర, శాబు పాల్గొన్నారు.

కదం తొక్కిన అంగన్వాడీలు

- కళ్లకు గంతలు కట్టుకుని నిరసన
- సచివాలయ కార్యదర్శులకు వినతులు
- 19వ రోజూ కొనసాగిన సమ్మె

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అన్నమయ్య జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్నారు. గ్రామ సచివాలయాల వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.



బి.కొత్తకోట : కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె ఆపే ప్రసక్తే లేదని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దొమ్మరాజు భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం రాయచోటి, సంబేపల్లి, చిన్నమండెం మండలాల్లోని సచివాలయ సిబ్బందికి వినతీ పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె 19 రోజులకు చేరిందని, అయినా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాల పెంపు, గ్రాట్యూటీ అమలు తదితర విషయాల్లో ప్రభుత్వం నోరు మెదపలేదన్నారు. గతంలో జరిగిన చర్చల్లో మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని అంగీకరించారని, ఇప్పటి వరకు దీనికి సంబంధించిన జిఒ ఇవ్వలేదన్నారు. అంగన్వాడీ గ్రేడ్-2 సూపర్వైజర్ 560 పోస్టులు ఇచ్చామని మంత్రి ఉషశ్రీ చరణ్ అబద్ధాలు ఆడుతున్నారన్నారు. తమ సమ్మెకు లబ్దిదారుల నుంచి అపూర్వ మద్దతు లభిస్తుందని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలను తెరవాలని ప్రభుత్వం నాలుగు శాఖలతో తలకిందులుగా తపస్సు చేసిందన్నారు. ఇప్పటి వరకు ఒక్క పిల్లాడికి కూడా సరైన తిండి పెట్టలేకపోయిందన్నారు. ప్రభుత్వం అద్దెలు ఇవ్వకపోయినా గర్భిణులు, బాలింతలకు పోషణ అందించామన్నారు. సచివాలయ కార్యాలయాలకు వెళ్ళి సామూహిక వినతిపత్రాలు ఇచ్చిన్నట్లు చెప్పారు. అప్పటికి సమస్యలు పరిష్కరించకపోతే జనవరి నుంచి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తమ ఆందోళనలకు రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు, లౌకిక ప్రజాతంత్ర వాదులు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ లీడర్లు విజయమ్మ, సిద్దమ్మ, నాగమణి, అరుణ, మస్రూన్ బీ, సుమలత, వనజ, ప్రవీణ, సబీనా, రమీజా, ఇందిరమ్మ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె యధావిధిగా కొనసాగుతోంది. ఒక్కోరోజు ఒక్కో విధంగా ప్రభుత్వానికి తమ నిరసనలను తెలియజేస్తున్నారు. కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం తాము 19 రోజులుగా నిరవధిక ముఖ్యమంత్రి జగన్ పాదయాత్ర సందర్భంగా అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు,హెల్పర్లు పాల్గొన్నారు. **మదనపల్లి :** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు హరింద్రనాథ్ శర్మ, మధురవాణి, రాజేశ్వరి మాట్లాడుతూతమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గౌరీ, కరుణ, స్వారూపా, భూకైలేశ్వరి, అమ్మాజీ, విజయ, అఖిరున్నిసా, బాగ్యా, గీతా సుజాని, శ్రీవాణి, ఈశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** ప్రభుత్వం నిరంకుశత్వానికి, మంత్రులు అసత్య ప్రచారాలకు వ్యతిరేకంగా తహశీల్దారు కార్యాలయం నుండి ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు. ఎంపిడిఒ కార్యాలయం లోపల సచివాలయ ఉద్యోగుల, ఆన్‌లైన్ సమావేశాలు జరుగుతుండగా సిఐటియు నాయకులు వారితో మాట్లాడుతూ సచివాల ఉద్యోగులు, తమ కడుపు కొట్టొద్దని, చట్ట వ్యతిరేక పనులు చేయొద్దని, మీ పనులు మీరు చూసుకోవాలని, తోటి కార్మికులుగా ఉద్యమానికి సంఘీభావం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎండిఒకు వినపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పి.జాన ప్రసాద్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ప్రాజెక్టు గౌరవ అధ్యక్షులు, వనజ కుమారి, అధ్యక్షులు, రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధా కుమారి, మండల కార్యదర్శి జి.పద్మావతి, వెన్నెల, దుర్గ, శిరీష, లీలావతి, జయకుమారి, సుజాత, మునీంద్ర, ఈశ్వరమ్మ, కుమారి, నాగరాణి, వాణి, స్వర్ణలత, గీత, సురేఖ, కళ, రెడ్డమ్మ, రోజా, చెంచులక్ష్మి, బేబీ, సునీత, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పురపాలక పరిధిలోని 21, 22వ సచివాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని అడ్మిన్లకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ రాజంపేట ప్రాజెక్టు నాయకులు విజయ, కార్యకర్తలు అనురాధ, అమరావతి పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నుండి గ్రామ సచివాలయం వరకు ర్యాలీగా వెళ్లిన అంగన్వాడీలు సచివాలయ సిబ్బందికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధిగాల్ల శ్రీనివాసులు, ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుకుమారి, ఓబులమ్మ, గౌరవ అధ్యక్షులు ప్రభావతమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు



రైల్వేకోడూరు : మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్



రాయచోటి : సంబేపల్లె సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

మెడకు ఉరితాళ్లతో నిరసన

- ప్రయివేట్ డ్రైవర్లను అడ్డుకున్న కార్మికులు
- నాయకులను అరెస్టు చేసిన పోలీసులు
- కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న నిరసన
- టిడిపి, కాంగ్రెస్, జనసేన, ప్రజా సంఘాల నాయకుల సంఘీభావం
- 5వ రోజూ కొనసాగిన సమ్మె



రాయచోటి : మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రయివేటు వ్యక్తులతో పనులు చేయించేందుకు అధికారులు చేసిన ప్రయత్నాన్ని మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు అడ్డుకున్నారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన రాష్ట్ర వ్యాప్త సమ్మె శనివారం ఐదో రోజు భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద రాయచోటి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అర్ధనగ్నంగా ఉరితాళ్లు మెడకు వేసుకుని నిరసన తెలియజేశారు. పెద్దఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట నినాదాలు నినదించారు. ఉదయం 5 గంటలకు క్లాప్ డ్రైవర్ల స్థానంలో ప్రయివేట్ వ్యక్తులను నియమించాలని అధికారుల ప్రయత్నాన్ని పారిశుధ్య కార్మికులతో పాటు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అడ్డుకున్నారు. మున్సిపల్ కమిషనర్ రెడ్డి ఎంటర్ ప్రైజెస్ యాజమాన్యానికి ఏజెంట్‌గా పనిచేయడమే గాక పోలీసు సాయంతో ఆందోళన చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రామాంజులు భుజానికి, చేతలకు గాయాలయ్యాయి. పోలీసుల వైఖరికి వ్యతిరేకంగా పోలీసుస్టేషన్లో బైటాయింపు చేయడంతో 7.30కి వదలేశారని తెలిపారు. అనంతరం పది గంటలకు ఉరితాడు నిరసన కార్యక్రమానికి పెద్దఎత్తున అంగన్వాడీలు మున్సిపల్ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్య లక్ష్మి,రైతు సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి ఎస్.రామచంద్ర, కెవిపిఎస్ జిల్లా కో-కన్వీనర్ డిసి వెంకటయ్య మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న జనాభాకనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచడంలో కమిషనర్ నిర్లక్ష్యంతో మిగిలిన కార్మికుల మీద తీవ్ర పనిభారం పెరుగుతోందని తెలిపారు. రిటైర్ భెనిఫిట్స్ గ్రాట్యూటి ఇవ్వకుంటే సామాజిక సాధికారత ఎలా అవుతుందన్నారు. క్లాఫ్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలనిచట్టం చెబితే కేవలం రూ.10 వేలిచ్చి మిగిలినవి నిధుల్లేవని కాలాలు సరైనవి కావన్నారు. మీరు పోటీ కార్మికుల చేత పని చేయించడం ఆపాలన్నారు. మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ రెగ్యులర్ చేసే వరకు ప్రజాసంఘాల మద్దతుతో నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు బంగారుపాప, ఖాజాబీ, విజయ, సిద్ధమ్మ, అరుణ, అమరావతి, మాలతి, సురేఖ, మున్సిపల్ కార్మికులు వై.వెంకటరమణ, రాంబాబు, అగ్గిరామయ్య, జి.వెంకటరమణ, ఓబులేసు, తిరుపాల్, మంగమ్మ, రమణమ్మ, సిఎం లక్ష్మిదేవి, రవికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపడుతున్న కార్మికులు పురపాలక కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియోజకవర్గ బాధ్యులు పూల భాస్కర్, సమన్వయ కమిటీ సభ్యులు శెట్టిపల్లి సన్నీ నిరసనలో పాల్గొని సంఘీభావం తెలిపి ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల డిమాండ్లు నెరవేర్చే వరకు కాంగ్రెస్ పార్టీ వారికి మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు పారిశుధ్య కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు డిమాండ్ చేస్తున్న కోరికలన్నీ న్యాయబద్ధమైనవేనన్నారు. ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోవడం బాధాకరమని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, కోలాటం హరిపాల్గొన్నారు.



రాయచోటి : వాహనాలను అడ్డుకున్న కార్మికులు



రాజంపేట : కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్


ప్రజాశక్తి-రాయచోటి

రాబోయే నూతన సంవత్సరంలో ప్రభుత్వం సంక్షేమ పథకాల జాతర చేయనుందని, జనవరి, ఫిబ్రవరి మాసాలలో అమలు చేయనున్న సంక్షేమ పథకాలను పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ గిరీష సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి 2024 జనవరి ఒకటో తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో నిర్వహించనున్న వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద కొత్తగా పెంచిన పెన్షన్ల పంపిణీ, జనవరి 17 నుంచి వైఎస్ఆర్ ఆసరా రుణమాఫీ నాలుగో విడత పంపిణీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఫిబ్రవరి 5న వైఎస్ఆర్ చేయూత కింద లబ్ధి పంపిణీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలు, చేయవలసిన ముందస్తు ఏర్పాట్లపై ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్పెషల్ అధికారులు, డిఆర్‌డిఎ, ఎపిఎంలతో కలెక్టరు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏరోజు ఏ మండలంలో కార్యక్రమం నిర్వహిస్తారో ఆరోజు ఆ మండలంలో కొత్తగా పెంచిన పింఛను పంపిణీ చేయబడుతుందన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న పింఛనుదారుల వివరాలను మొబైల్ అప్లికేషన్లో వందశాతం వెంటనే వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. స్థానిక శాసనసభ్యులను, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని జనవరి 2 నుంచి 8 లోపు మండలాల్లో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. జనవరి 23న వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత లబ్ధి పంపిణీ కార్యక్రమంపై 17 నుంచి 22 వరకు ముందస్తు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డిఆర్‌డిఎ సిబ్బంది మహిళా సంఘాల వారీగా, సచివాలయం వారీగా సిబ్బందికి అవగాహన కల్పించి తగు సూచనలు జారీ చేయాలన్నారు. ఫిబ్రవరి 5న వైఎస్ఆర్ చేయూత పథకాన్ని మంత్రి ప్రారంభిస్తారన్నారు. ఆయా కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు పాల్గొనేలా వారితో సమన్వయం చేసుకుని వారి షెడ్యూల్ ప్రకారం ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని పండుగ వాతావరణంలో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు సత్యనారాయణ, మద్దిలేటి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్పెషల్ అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, డిఆర్‌డిఎ, ఎపిఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

చిన్నయ్యకు తెలుగు మహాసభలకు ఆహ్వానం



ఆహ్వాన పత్రం అందుకుంటున్న విద్వాన్ వల్లూరు చెన్నయ్య

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పట్టణానికి చెందిన ప్రముఖ కవి, విశ్రాంత తెలుగు పండితులు విద్వాన్ వల్లూరు చిన్నయ్య జనవరి 5, 6, 7వ తేదీలలో రాజమహేంద్రవరంలో జరిగే రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలకు ఆహ్వానం అందుకున్నారు. తెలుగు భాషా సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ ఈ మేరకు ఆయన నివాసానికి వెళ్లి శనివారం ఆహ్వాన పత్రం అందించారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ

విద్యారంగ సమస్యలపై పోరాటాలు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఉపాధ్యక్షులు రమణ తెలిపారు. శనివారం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ప్రజాస్వామ్య సోషలిజం 54 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారన్నారు. బిజెపి ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యావ్యవస్థను నాశనం చేశారని విమర్శించారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత చదువులు దూరం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తూ రూ.1200 కోట్లు అవినీతికి పాల్పడ్డారని దీనిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలకు రంగులు వేసి మమ అనిపించడం తప్ప దానివల్ల ఒరిగిందేమీ లేదన్నారు. రాజంపేటలో ఐటిఐ కళాశాలకు గతంలో స్థలం కేటాయించి ఆ స్థలాన్ని మరలా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌కు కేటాయించారని, ప్రభుత్వ ఐటి కళాశాల నేటికీ అద్దె భవనంలోనే నడుస్తుందన్నారు. మ్మెల్యే, ఎంపీ స్పందించి ప్రభుత్వ ఐటి కళాశాలకు స్థలం కేటాయించి భవనం ప్రారంభించకపోతే విద్యార్థులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గౌరీ శంకర్, జంగయ్య, సుమంత్, నరేష్, యుగంధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జిఒ117 రద్దుకు సహకరించాలని చంద్రబాబుకు వినతి

ప్రజాశక్తి-పీలేరు : జిఒ నెంబర్ 117 రద్దుకు సహకరించి విద్యా వ్యవస్థను కాపాడాలని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరినట్లు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రెడ్డిరమేష్ తెలిపారు. కుప్పం పర్యటనలో ఉన్న చంద్రబాబుకు వినతిపత్రం సమర్పించామన్నారు. రాష్ట్రంలో డిఎస్‌సి నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, 5వ తరగతి వరకు మాతృభాషను అమలు చేస్తూ, ఆంగ్ల మాధ్యమంతో సమానంగా తెలుగుభాషను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసర ముందని కోరామన్నారు. ఈ విషయంపై బాబు స్పందిస్తూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తూనే ప్రతి సంవత్సరం టీచర్ పోస్టుల భర్తీకి డిఎస్‌సి నిర్వహిస్తామని, మాతృభాషను కొనసాగిస్తామని చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, ప్రధాన కార్యదర్శి రామయ్య, గౌరవ అధ్యక్షులు వాసుదేవ నాయుడు, సహాయ కార్యదర్శి హరిప్రసాద్, జిల్లా కార్యదర్శి సురేష్, భాస్కర్‌రెడ్డి, రాజేశ్వర్, ధనుంజయ, సిపిఎస్ జిల్లా అధ్యక్షులు సుధాకర్, రమణ పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో స్పోర్ట్స్ క్లబ్ వారు విద్యార్థులకు ఇంట్రమొరేల్స్ పోటీలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల జీవితాలలో ప్రాధాన పాత్ర పోషిస్తాయి అని తెలిపారు. క్రీడల వల్ల ఎన్నో లాభాలున్నాయని పేర్కొన్నారు. నిజానికి, విద్యార్థులకు ప్లేగ్రౌండ్‌కు అలవాటు చేయడం ఎంతో మంచిదని చెప్పారు. ఆరోగ్యకరంగా విద్యార్థులు ఎదగాలని తెలిపారు. విద్యార్థులు అనుకుంటే కచ్చితంగా క్రీడలను అలవాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంతో మంది విద్యార్థులు ఒబేసిటీతో బాధపడుతున్నారని తెలిపారు. అటువంటి సమస్యలను అధిగమించాలంటే కచ్చితంగా క్రీడలలో పాల్గొనే అలవాటు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఎదిగేందుకు స్పోర్ట్స్ ఉపయోగపడతాయన్నారు. కలశాల ప్రాంగణంలో విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, కరొమ్ విద్యార్థునులకు త్రోబాల్, కబడ్డీ, చెస్ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు, మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్, సాక్ కోఆర్డినేటర్ డాక్టర్ సమీనా, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి : 'కొరముట్ల'



మహిళకు కుట్టు మిషన్ పంపిణీ చేస్తున్న కొరముట్ల, అజయ్‌రెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కుట్టు మిషన్ల ద్వారా ఉపాధి పొంది మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన 120 మంది మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ హబ్స్‌లో శిక్షణ తీసుకొని యువత లక్ష్యసాధన దిశగా చిత్తశుద్ధితో కష్టపడి పని చేస్తే ఎంతటి కష్టతరమైన పనికూడా విజయవంతం అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం యువత ఉద్యోగాలు పొందేలా చాలా పథకాలను చేపట్టిందని, అందులో భాగంగానే రైల్వేకోడూరులో నైపుణ్య హబ్‌లను ఏర్పాటు చేసిందని చెప్పారు. జిల్లా యువత ఇటువంటి సౌకర్యాలను ఉపయోగించుకొని, ఉన్నత ఉద్యోగాలు పొందాలన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి క్రమశిక్షణ అలవరుచుకొని ఇష్టంతో కష్టపడి చదివి అన్ని రంగాలలో పట్టుసాధించి నైపుణ్యత కలిగి ఉంటే ఉద్యోగం మనల్ని వెతుక్కుంటూ వస్తుందన్నారు. ఆ దిశగా నైపుణ్యం విషయంలో కూడా యువతీ, యువకులు సీరియస్‌గా ముందుకు సాగాలన్నారు. ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, ఎపిఎండిసి ఎమ్‌డి వెంకట్‌రెడ్డి, అగ్రికల్చర్ అడ్వైసర్ కమిటీ చైర్మన్ సుకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఈ స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేసిందని దానిలో భాగంగా ప్రభుత్వ కళాశాలలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. టైలరింగ్ కోర్సులో శిక్షణ తీసుకున్న 120 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎపిఎండిసి చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపిపి ధ్వజారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ సుబ్బరాజు, జెడ్‌పిటిసి రత్నమ్మ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జనరల్ మేనేజ్ గోపీనాథ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ, శిక్షకులు పార్థసారధి, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



సాష్టాంగ నమస్కారాలు చేస్తూ నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

కొనసాగుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగుల దీక్షలు

- 11వ రోజు సాష్టాంగ నమస్కారాలు చేస్తూ నిరసన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20వ తేదీ నుండి చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 11వ రోజుకు చేరింది. సమగ్ర శిక్ష ఉద్యోగులు వినూత్నంగా పొర్లదండాలతో నిరసన తెలిపారు. ఈ సమ్మెకు మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పక్షంలో వున్నప్పుడు జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలన్నారు. 4 సంవత్సరాల 9 నెలలు పూర్తి కావస్తున్నా ఇంత వరకు హామీ నెరవేరలేదన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన నాడు-నేడు నుంచి పిల్లలకు చదువులకు అవసరమయ్యే అమ్మబడి,జగనన్న విద్యా కానుక, మధ్యాహ్న భోజనం, యూ డైస్ తదితర వాటిని ఎప్పటి కప్పుడు వారు నిర్దేశించిన సమయంలో వారు విధులను పూర్తి చేస్తున్నారు. రూ.10 లక్షల రిటర్మెంట్ బెనిఫిట్‌తో కూడిన గ్రాటివిటీ కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సూచించారు. రాష్ట్ర జెసి పిలుపు మేరకు 11 వరోజు పొర్లు దండాలు చేసి నిరసన వ్యక్తం చేసి రెగులర్ చేయాలని నినాదాలు చేశారు-అదే విధంగా సమగ్ర శిక్ష ఉద్యోగులకు షోకాజు నోటీసులు, టర్మినేషన్‌లు ఇచ్చి ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన షోకాజు నోటీసులను, టర్మినేషన్ ఆర్డర్స్‌ను మంటలో వేసి దహనం చేసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున సమగ్ర శిక్ష ఉద్యోగులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డిసిసి బ్యాంక్ సిబ్బందితో చర్చిస్తున్న సిఇఒ

రుణాల మంజూరులో భేష్ : డిసిసిబి సిఇఒ

ప్రజాశక్తి-గాలివీడు

ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని అన్ని డిసిసిబి బ్యాంకుల కంటే అత్యధికంగా ఎల్‌టి రుణాలు, వ్యక్తిగత రుణాలు, బంగారు రుణాలు ఇవ్వడంలో గాలివీడు డిసిసి బ్యాంక్ చొరవ అభినందించదగ్గ విషయమని డిసిసిబి సిఇఒ రాజేంద్ర కుమార్ పేర్కొ న్నారు. శనివారం గాలివీడు బ్రాంచ్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకులో ఉన్న హౌసింగ్, బంగారు రుణాలను తనిఖీ చేసి బ్యాంక్ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఏడిఐ నారాయ ణరాజు, బ్రాంచ్ మేనేజర్ సివి.నారాయణరెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ రెడ్డిశివప్రసాద్, అసిస్టెంట్లు శివప్రసాద్, ప్రమిద, మాధవి, క్లర్క్ రెడ్డప్ప, వెంకటేష్ పాల్గొన్నారు

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కలికిరి

మండల పరిధిలోని గుట్టపాలెం గ్రామంలో ఆదివారం ఉచి తంగా మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎస్‌పిఎస్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మొహమ్మద్ వసీం, డాక్టర్ సిమ్రాన్ తెలిపారు. ఈ శిబిరంలో సేవే మార్గంగా వైద్య బృందం పాల్గొని ఉచిత పరీక్షలు, ఉచిత మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని చుట్టుపక్కల గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



డాక్టరేట్‌ను అందుకుంటున్న పసుపులేటి శంకర్

పసుపులేటి శంకర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-నందలూరు

ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు పసుపులేటి శంకర్‌కు ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటిం చింది. శనివారం తమి ళనాడులోని హోసూరు హోటల్ హిల్స్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వివిధ రంగాలలో ప్రతిభ పాటవాలు ప్రదర్శించిన వారికి డాక్టరేట్లు అందచేశారని అన్నారు. ఆధ్యాత్మిక రంగంలో తన సేవలను గుర్తించి డాక్టరేట్‌ను ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

4 నుంచి అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని వివిధ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల నియామకానికి మౌఖిక ఇంటర్వ్యూలను జనవరి 4, 5వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ పీడీ డి.శశికళ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు 20, సహాయకురాలు 45, మినీ అంగన్వాడీ కార్యకర్తలు 11, పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటికి ఈనెల 18వ దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులకు రెవిన్యూ డివిజన్ వారిగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జనవరి 4వ రాయచోటి, రాజంపేటఆర్‌డిఒ కార్యాలయం, మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు, 5వ మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు రెవిన్యూ డివిజన్‌కు కేటాయించిన తేదీలలో సూచించిన, కేటాయించిన ప్రదేశాలకు మౌఖిక పరీక్ష కొరకు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని హాజరుకావాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్ లేని అభ్యర్థులను మౌఖిక పరీక్షకు అనుమతించరని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - చాపాడు : జనవరి 24న నిర్వహించబోయే జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని చాపాడు విద్యా వనరులలో బాలికల సంరక్షణ అమలు అంశంపై మండలంలోని హైస్కూల్ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రొయిటింగ్‌లో చాపాడు హైస్కూల్ పదవ తరగతి విద్యార్థి బి నాగదేవి, బిటెక్‌లో కస్తూరిబా పాఠశాల విద్యార్థి కె రాజేశ్వరి, వ్యాసరచన పోటీలో కస్తూరిబా పాఠశాల విద్యార్థి జె నందిని ప్రథమ స్థానంలో గెలుపొం దారు. విద్యార్థులు జనవరి 24న జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొంటారని ఎంఇఒ రవికాంత్ తెలిపారు. కార్యక్రమంలో జడ్జిలుగా వి.వంశీ కృష్ణ, ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రావ్ వ్యవహరించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు. **వేంపల్లె :** పోటీ పరీక్షల్లో విద్యార్థులు రాణించినప్పుడే విద్యపట్ల వున్నవని పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం చెరుకూరు శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 'సేవ్ ద గర్ల్ చైల్డ్' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ విజేతగా 8వ తరగతికి చెందిన పూజ , ద్వితీయ విజేతగా రోషిని, తృతీయ విజేతగా పావని ప్రతిభ చూపినట్లు చెప్పారు. వక్తృత్వ పోటీలలో మైనార్టీ ఉర్దూ గురుకుల పాఠశాలకు చెందిన పొఖియా మొదటి విజేతగా నిలవగా ద్వితీయ స్థానంలో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్. జాహ్నవి, తృతీయ స్థానంలో గురుకుల పాఠశాల విద్యార్థి సమీరా, చిత్రలేఖనం పోటీలలో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిరూ, సంధ్యశ్రీ, పూజిత ఎంపికైనట్టు చెప్పారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొనాలని కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం చెరుకూరు శ్రీనివాస్ అభినందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

బిటెక్ రవి వ్యాఖ్యలు అర్థరహితం : వైసిపి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్ : గన్ మెన్ తొలగింపుపై బిటెక్ రవి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని వైసిపి నాయకులు, పులివెందుల పురపాలక చైర్మన్ వల్లెపు వరప్రసాద్, ఎపి పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, రసూల్, జెసిఎస్ నాయకులు చంద్రమౌళి, కౌన్సిలర్ కిషోర్ పేర్కొన్నారు. శనివారం వైఎస్. మనోహర్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్ కుటుంబం ఎప్పుడూ ఫ్యాక్షనిజాన్ని ప్రోత్సహించదని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని, పులివెందులలో బిటెక్ రవి సింగిల్ గా తిరిగినా, ఆయన జోలికి వెళ్లే వారే లేరని పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు మాత్రమే గన్ మెన్ కేటాయించారని, ఆయన మాజీ ఎమ్మెల్సీ కాబట్టి గన్ మెన్ తొలగించారని వారు స్పష్టం చేశారు. వైఎస్ఆర్ 2004లో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 95 శాతం ఫ్రాక్షనిజం పూర్తిగా చేశారని, ఐదు శాతం పనులు టిడిపి ప్రభుత్వం చేయడానికి మూడు సంవత్సరాలు పట్టిందా అని విమర్శించారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన ఘనత వైఎస్ కుటుంబానిదేనని తెలిపారు. కార్యక్రమంలో కో- ఆప్షన్ సభ్యులు చంద్రమౌళి, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -బి.కొత్తకోట

కులం, మతం, పార్టీ భేదం చూపకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చలిమామిడి బుద్దల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో చలిమామిడి, బలసరపెంట, బురుజుపల్లెలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజా సమస్యల అడిగి తెలుసుకొని అక్కడి అక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అన్నివర్గాలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రిని మరోసారి ఆశీర్వదించాలన్నారు.నవరత్నాలతో పేద,మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగు నింపారని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలు అమలు కానీ హామీలతో ప్రజల ముందుకు వస్తారని ప్రజలెవ్వరూ మోస పోవద్దని కోరారు. అభివృద్ధి,సంక్షేమ కోసం పాటు పడుతున్న సిఎం జగన్‌ను మరల ముఖ్యమంత్రిని పేదల జీవితాలు బాగుపడతాయని అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ప్రదీప్ రెడ్డి, వైసిపి పట్టణం కన్వీనర్ సిఆర్ చిన్నికృష్ణ, జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్‌బాషా, ఎస్‌ఎస్ ఫయాజ్, సబ్జి, సద్దాం, గట్టు, నాయనబావి సర్పంచ్‌లు ఉమా మహేశ్వరి లక్ష్మి నారాయణ, జయరామిరెడ్డి, మాజీ సర్పంచ్ మియ సాబ్, సచివాలయ కన్వీనర్ సికిందర్ బాషా, పరెసు శీన,హరినాథ్‌రెడ్డి, మురళి, చంద్రయ్య, దామోదరరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, అరీఫ్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

టిడిపి హయాంలోనే బిసిల అభివృద్ధి :'నల్లారి'



ఇంటింటి ప్రచార కార్యక్రమంలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కలికిరి

టిడిపి హయాంలోనే బిసిల అభివృద్ధి జరుగుతుందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సంద్రావారిపల్లి గ్రామంలో సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు ఆధ్వ ర్యంలో చేపట్టిన బాబుషూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హాయాంలోనే బిసిలకు సమచిత న్యాయం జరిగిందని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బిసిల ఓట్ల కోసం కార్పోరేషన్లను ఏర్పాటు చేసి ఒక్క రూపాయి నిధులు కూడా కేటాయించ లేదన్నారు. టిడిపి బిసిలు వెన్నముక లాంటి వారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిసిలంతా చంద్రబాబు వెంటే ఉండి ఆయనను ముఖ్యమంత్రిని చేసుకో వాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్రంలో వైసిపి పాలనపై ప్రజలు విరక్తి చెంది ఉన్నారని ఎప్పుడు ఎన్నికలు వస్తాయోనని వేచి చూస్తున్నారని అన్నారు. మరోమారు టిడిపిని ఆదరిస్తే బిసిల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, కలికిరి మేజర్ పంచాయతీ సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ కుమార్‌రెడ్డి, మల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, పార్లమెంటు బిసి ఉపాధ్యక్షులు వాసు, నూరి చంద్రశేఖర్, రాజంపేట పార్లమెంట్ కురబ అధ్యక్షుడు జనార్ధన్ గౌడ్, ప్రేమనాథరెడ్డి, మాజీ సర్పంచ్ రసూల్ సాహెబ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అరెస్టు అక్రమం

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మున్సిపల్ కార్మికుల అరెస్టు అక్రమమని, సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చెయ్యాలి తప్ప అరెస్టులు, బెదిరింపులతో ఉద్యమం ఆపలేరని సిపిఎం జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు హెచ్చరించారు. రాయచోటి పట్టణంలో మున్సిపల్ కార్మికుల అక్రమ అరెస్టును నిరసిస్తూ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర లోను, అసెంబ్లీలోను ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని సమాన పనికి సమాన జీతం, ఉద్యోగాల పర్మినెంట్, సిపిఎస్ రద్దు తదితర సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. మున్సిపల్ కార్మికులు గత ఐదు రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్యలు పరిష్కరించడానికి బదులుగా కార్మికుల పొట్ట కొట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమని అన్నారు. సమ్మెతో ప్రజలకు ఏర్పడే అసౌకర్యాలను తొలగించేందుకు కార్మిక సంఘాలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమ్మెను నివారించాల్సిన బాధ్యత మరచి కార్మికుల మధ్య చిచ్చుపెట్టేపనికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఖండించారు. ప్రజలపైన ప్రేమను వలకబోస్తూ ఐదేళ్ల తర్వాత ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు చెప్పడం మానుకోవాలని హితవు పలికారు. చర్చల పేరుతో కాలయాపన చేసి కార్మికులను సమ్మెలోకి నెట్టిందని అన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అన్న ముఖ్యమంత్రి లక్షలాది మంది అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చెయ్యకుండా, సమాన పనికి సమాన వేతనం అమలు చేయకుండా, దగా చేసిందికాక అక్రమ కేసులు బనాయించి ఉద్యోగాల నుండి తొలగిస్తామంటూ బెదిరింపులకు పాల్పడడం సిగ్గుచేటని అన్నారు. పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించి సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూడటం అవివేకమని అన్నారు. తక్షణమే మున్సిపల కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

దళిత గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించండి

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండలం, ముడుపుల వేముల పంచాయతీ, విద్యానగర్ ఎస్‌సి కాలనీలో తహశీల్దార్ ధనుంజయలు అధ్యక్షతన శనివారం పౌరప -క్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లా డుతూ జస్టిస్ పున్నయ్య కమిటీ జిఒ ప్రకారం ప్రతి నెల చివరన దళిత గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నామని చెప్పారు. దళితుల ఆత్మ గౌరవం దెబ్బతినే విధంగా ఎవరైనా ప్రవర్తించి కులం పేరుతో దూషించినా, దాడి చేసినా అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. సమాజంలో మానవులందరూ ఒక్కటేనని, కులమత తారతమ్యాలు లేకుండా జీవించాలని కోరారు. దళితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అర్హులైన వారు ఆ పథకాలను సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ మాట్లా డుతూ గ్రామాల్లో ఇంకా అర్హులైన డప్పు కళాకారులు పింఛన్‌లు, పక్కాగృహాలకు నోచుకోలేదని అన్నారు. గద్దకుంటపల్లిలో పురాతనం నుంచి శ్మశాన వాటిక ఉందని, దాన్ని ప్రభుత్వ రికార్డులలో నమోదు చేయాలని కోరారు. మడుపులవేముల గ్రామంలో స్మశాన వాటికకు స్థలం చూపాలన్నారు. దళితుల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ సర్వేనెంబర్ 404లో కబ్జాకు గురైన 29 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి కాలనీ వాసులకు అప్పగిస్తూ ఆ స్థలానికి హద్దులు చూపించారని, ఆ స్థలంలో విద్యుత్ స్తంభాలు నాటి ఉన్నారని, వాటిని తొలగించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఉపాధి హామీ పథకం కింద విద్యానగర్ కాలనీవాసులకు పనులు కల్పించాలని కోరారు. దళితుల భూముల ముటేషన్లను ఆన్‌లైన్ చేయడానికి సంవత్సర కాలంగా సంబంధిత విఆర్‌ఒ శాంతి కుమార్‌రెడ్డి బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డాక్టర్ మురళీమోహన్ రెడ్డి, ఎస్‌ఐ రమణ, వెలుగు ఎపిఎం లక్ష్మణ్ రెడ్డి, ఉపాధి పిఒ మహేశ్వర్, సర్పంచ్ రాజేష్ , సచివాలయ సిబ్బంది, బాస్ నాయకులు ముల్లంగి కృష్ణయ్య, హరినాథ, గురవయ్య, రాష్ట్ర గిరిజన సమైక్య పీలేరు నియోజకవర్గం అధ్యక్షులు కిల్లా విజయ్ కుమార్, ఎం ఎస్‌పి నాయకులు గండికోట వెంకటేష్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** నగర పంచాయతీ పరిధిలోని జైభీమ్‌నగర్‌లో శనివారం సివిల్ రైట్స్ డేను నిర్వహిం చారు. ఈ సమావేశంలో తహశీల్దార్ రఫిక్‌అహ్మద్, బి.కొత్తకోట ఎస్‌హెచ్‌ఒ ప్రశాంత్, మున్సిపల్ మేనేజర్ రమాదేవి, విద్యుత్‌శాఖ ఎఇ, ఎంఇఒ, వెలుగు సిసి, పశువైద్య అధికారి, కుల సంఘ నాయకులు హజరయ్యారు. నగర పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.60కోట్లు మంజూరు అయ్యా యని అధికారులు తెలిపారు. జై భీమ్‌నగర్‌లో మురుగునీటి కాలు వలు, సిమెంట్ రోడ్లు, నీటి సరఫరా, తాగునీటి కుళాయిలు వేసి మా నిధు లను మాకే ఖర్చు చేయాలని బాస్‌నాయకులు అధికారులను కోరారు. అధికా రులు సానుకూలంగా స్పందించి నెలలోపు సమస్యలను పరిష్కరించి, మరల ఇక్కడే సమావేశం నిర్వహి స్తామని వెల్లడించారు. కార్యక్రమంలో బాస్ జిల్లా కార్యదర్శి సింగన్న,మాల మహా నాడు నరసింహులు, మండల అధ్యక్షుడు వెంకటేష్, బి.కే.శంకర్ పాల్గొన్నారు.



పీలేరు : దళిత నాయకులతో మాట్లాడుతున్న తహశీల్దార్ ధనుంజయలు



బి.కొత్తకోట : సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

అన్ని రంగాల్లో వైసిపి ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి కడప నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి వి.ఎస్. అమీర్ బాబు, సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి విమర్శించారు. శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ప్రారంభించారు. అక్కడి నుంచి రోడ్డుకు ఇరు వైపులా ఉన్న వాపారులను పలకరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రకాల పన్నులు ప్రజల నెత్తిన వేసి భారం మోపుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీలు విపరీతంగా పెంచేశారన్నారు. ఎక్కడా లేనివిధంగా పెట్రోల్, డీజిల్ ధరలు మన రాష్ట్రంలో ఉన్నాయని పేర్కొన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే హారాలు తగ్గించాలని ప్రజలు తమను కోరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, ఉపాధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది లింగాల శివశంకర్ రెడ్డి, మాజీ వార్డు మెంబర్ జయరామిరెడ్డి, పాలకొండ్రాయిడ్ దేవస్థానం మాజీ చైర్మన్ ఓబుల్‌రెడ్డి, బిసి సెల్ కార్యదర్శి శ్రీనివాసులు, తెలుగు యువత నగర అధ్యక్షులు మేకల వెంకటేశ్ యాదవ్, నాయకులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్దనూరు : టిడిపి పాలనలోనే ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ లభిస్తుందని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో శనివారం భూపేష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి టిడిపి మేనిఫెస్టో పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, రమణారెడ్డి, టౌన్ అధ్యక్షులు రంగారెడ్డి, మండల అధ్యక్షులు శివరామిరెడ్డి, మైనారిటీ నాయకులు అబ్దుల్ ఖాదర్, నాయకులు నాయుడు, రాజశేఖర్ యాదవ్, దామోదర్,భాస్కర్ రెడ్డి, బాబా అమీర్, సాయి, మాబు, లక్ష్మి నారాయణ, ప్రేమ్ నాథ్ రెడ్డి,రామకృష్ణారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. **చెన్నూరు :** టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తానరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల కన్వీనర్ కల్లూరు విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ శనివారం కొకరాపల్లి గ్రామంలో నిర్వహించారు. మినీమేనిఫెస్టోను ప్రజలకు వివరించి, మొబైల్‌లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించారు. కార్యక్రమంలో 71 బూత్ ఇన్‌ఛార్జి జడ లక్ష్మీనారాయణ, సర్పంచ్ సురేంద్ర, శ్రీకాంత్, రామకృష్ణారెడ్డి, ఐటిదడిపి క్లస్టర్ ఎం.కె. కాంత్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ సైకిళ్లు పంపిణీ


ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మున్సిపాలిటీ ఇన్‌ఛార్జి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాదవ్, వైస్ చైర్మన్ హఫీజ్ స్థానిక ముఖ్యమంత్రి కార్యాలయంలో శనివారం విభిన్న ప్రతిభావంతులకు ఎలక్ట్రికల్ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంకా ఎవరైనా నడవలేని వారు ఇబ్బందులు పడుతుంటే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృఢమైన సంకల్పంతో, ఎంపీ వై.ఎస్.అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విభిన్న ప్రతిభావం తులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కో - ఆప్షన్ సభ్యులు దాసరి చంద్రమౌళి, కౌన్సిలర్లు పార్లపల్లి కిషోర్ , రాజశేఖర్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు క్రీడా సామగ్రి వితరణ

ప్రజాశక్తి- సింహాద్రిపురం

మండల పరిధిలోని నిడివిలగల సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రూ.25 వేలు విలువచేసే క్రీడా సామగ్రిని అందజేసినట్లు ప్రిన్సిపల్ తాతాజీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ బెంగళూరు చెందిన స్కంద ఇంజినీరింగ్ ప్రాజెక్టు 2 ఎం.డి చంద్రశేఖర్ వితరణ చేశారన్నారు. ఇందులో టేబుల్ టెన్నిస్, వాలీబాల్, డిస్కస్ త్రో, ఇతర క్రీడా సామగ్రిని అందజేశారు. సామగ్రిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరాలని ఆయన కోరారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న పూల జనార్ధన్

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా జనార్ధన్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కాంగ్రెస్‌పార్టీ రాజంపేట మండల అధ్యక్షులుగా పూలజనార్ధన్ శనివారం ఆపార్టీ నియో జకవర్గ బాధ్యులు పూల భాస్కర్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ తనకు పదవి రావడానికి సహకరించిన పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, నియోజకవర్గ బాధ్యులు పూల భాస్కర్, సమన్వయ కమిటీ సభ్యులు శెట్టిపల్లి సన్నీలకు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, పోలీసు నిబంధనలను అతి క్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం నుంచి పోలీసు నిబంధనలు అమలలో ఉంటాయని, నూతన సంవత్సరం సందర్భంగా అతిగా మద్యం సేవించి వాహనం నడపటం, మైనర్లు వాహ నాలు నడపటం, రోడ్లపై ప్రజలకు ఇబ్బందికరంగా ప్రవర్తించడం, బహిరంగ ప్రదే శాల్లో కేక్‌లు కటింగ్ చేయటం వంటి పనులు చేసిన వారిపై చట్టప రమైన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. వేడుకలను బహిరంగ ప్రదేశాలలో కాకుండా కుటుంబ సమేతంగా ఇంటివద్ద జరుపుకోవాలని అన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు .**పెద్దమండ్యం:** నూతన సంవత్సర స్వాగతం కార్యక్రమాలు ఎక్కడైనా ప్రజలకు ఇబ్బంది కరంగా నిబంధనలు దాటితే కఠిన చర్యలు తప్పవని పెద్దమండ్యం ఎస్.ఐ రామంజనేయుడు హెచ్చరించారు.ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి పెద్దమండ్యం మండలం ప్రధాన రహదారుల్లో, ప్రాంతాల్లో కఠిన చర్యలు అమలు చేస్తామని అన్నారు.

7న జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి- ఖాజీపేట

స్థానిక ఆర్ఇఎస్ జూనియర్ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వ ర్యంలో జనవరి 7న జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు నిర్వహి ంచనున్నట్లు జన విజ్ఞాన వేదిక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శనివారం తెలి పారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా స్థాయి పోటీల గురించి చర్చించుకున్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు బాల బయన్న, పోలంకి శ్రీరాములు, వెంక టేశ్వర్లు, సిద్ధవటం వెంకటసుబ్బయ్య, భాస్కర్ రెడ్డి, బాషా సుబ్బయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

మండల పరిధిలో అక్రమంగా ఇసు కను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ పి.రామకృష్ణ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు..వాల్మీకిపురం మండలం, విఠలం గ్రామానికి చెందిన సురేష్‌కు సంబంధించిన ట్రాక్టర్ మండలంలోని ముష్టూరు గ్రామం బహుదనది నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. శనివారం బహుదానది నుంచి అక్రమంగా ఇసుక ను తరలి స్తున్న ట్రాక్టర్‌ను దిగువపల్లి వద్ద పట్టుకొని సీజ్‌చేసి, ట్రాక్టర్ యజమాని సురేష్, వాల్మీకిపురం మండలం జర్రావారిపల్లి వడ్డిపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రెడ్డి శేఖర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఇసుకను తరలించ డానికి అనుమతులు లేవన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.



కోడిపందెం రాయుళ్ల అరెస్టును చూపుతున్న పోలీసులు

తొమ్మిది మంది కోడిపందెం రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

కోడిపందెం స్థావరపై దాడులు నిర్వహించి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు... శనివారం బండ్లపై పంచాయతీ సమీపంలో కొంతమంది కోడిపందెం ఆడుతు న్నట్లు రహస్య సమాచారం అందిందన్నారు. తమ సిబ్బందితో కలిసి కోడి పందెం స్థావరంపై దాడులు నిర్వహించి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.4,480లు, రెండు పందెం కోళ్ల ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో హెడ్ కాని స్టేబుల్ శివరామకృష్ణ, కానిస్టేబుల్లు సుమతి, రాజేష్, శివ, సంతోష్‌లు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-ములకలచెరువు

కర్ణాటక మద్యాన్ని తీసుకవెళుతున్న కడప జిల్లాకు చెందిన ఇద్దరిని ములకలచెరువు ఎస్‌ఇబి పోలీసులు పిటిఎం వద్ద అరెస్టు చేశారు. సెబ్ ఎస్ఐ లక్ష్మినరసయ్య తెలిపిన వివరాల మేరకు. కడప జిల్లా, చక్రాయపేట మండలం భగినెనాయక్ తండాకు చెందిన ఇ.శ్రీను నాయక్(34), ఇ.తిరుపాల్ నాయక్(51) ద్విచక్ర వాహనంలో కర్ణాటకకు చెందిన 80 టెట్రా మద్యం ప్యాకెట్లు తీసుకొస్తుండగా పిటిఎం జింకలమిట్ట వద్ద స్వాధీనం చేసుకొని బైక్‌ను సీజ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

వ్యక్తిపై హత్యాయత్నం

- కత్తితో దాడి, ఆస్పత్రిలో చికిత్స

ప్రజాశక్తి- రాయచోటి టౌన్

జిల్లా కేంద్రం రాయచోటిలో ప్రభుత్వ కళాశాల వద్ద వెంకటేశ్వర్లు నాయుడు అనే వ్యక్తి పై శనివారం శ్రీనివాసులు అనే వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన పట్టణంలో కలకలం రేగింది. వెంకటేశ్వర్లునాయుడు మెడపై తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన గాయపడిన వ్యక్తిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరూ పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారని ఈ విష యంలో ఘర్షణకు కారణమై ఉండవచ్చని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.